# సాక్షి

## అన్నమయ్య జిల్లా

మంగళవారం। 14। జనవరి। 2025






**ఆరు పదుల వయస్సులోనూ తగ్గేదేలే.!**

ఆరుపదుల వయస్సు దాటితే చిన్నపని చేసినా అలసట వస్తుంది. అయితే రాజంపేట క్రికెట్ క్లబ్ మాజీ క్రీడాకారుల్లో భోగిపండుగ రోజు అలసట ఏమాత్రం కనిపించదు. - 8లో



**పోటా పోటీగా బండలాగుడు పోటీలు**

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బండలాగుడు పోటీలు నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.110 | రూ.140 |
| రెండోరకం | రూ.80 | రూ.100 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 145 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 548 | 550 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 166.240 కిలోలు

### న్యూస్‌రీల్

#### రేపటి నుంచి పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు



పీరయ్యస్వామి

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామం పీరయ్యమఠంలో 219 సంవత్సరాల క్రితం సజీవ సమాధి అయిన పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నాలుగో పీఠాధిపతి మఠం నాగలింగమయ్య ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు మంత్రి మండిపల్లి పీరయ్యస్వామి సుప్రభాతం పుస్తకావిష్కరణ రాంప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా జరగనుంది. రాత్రి 8 గంటల నుంచి అఖండ భజన, చెక్కభజన, కోలాటం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు జరుగుతుంది.భక్తులు ఆరోధనాత్సవాల్లో పాల్గొనాలని మఠాధిపతి వారసులు తెలిపారు.

#### వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ వలంటీర్స్ విభాగం ఉపాధ్యక్షుడిగా ఎర్రబోతుల శివ భాస్కర్ రెడ్డి, స్టేట్ మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా రాచపల్లి వెంకట సుబ్బారెడ్డి, స్టేట్ మున్సిపల్ విభాగం కార్యదర్శిగా పల్లారెడ్డి భాస్కర్, స్టేట్ మున్సిపల్ వి °గ్ జాయింట్ సెక్రటరీగా డి వెంకటసుబ్బయ్య లను నియమించారు.

#### వైభవంగా రామయ్య పౌర్ణమి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవమూర్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల ఉత్సవ మూర్తులకు అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాలయ అవరణలో ప్రత్యేక కళ్యాణ వేదికను ఏర్పాటు చేశారు. సీతా రాముల ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు, అర్చకులు వీణా మనోజ్‌కుమార్‌లు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

#### రామయ్యను దర్శించుకున్న ప్రకాశం జిల్లా న్యాయమూర్తి



రామాలయంలో ప్రకాశం జిల్లా న్యాయమూర్తి భారతి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారిని సోమవారం ప్రకాశం జిల్లా న్యాయమూర్తి ఎ. భారతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.బాలాలయంలో ఉన్న మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

#### కళలను ఆదరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కళలను, సంస్కృతి, సాంప్రదాయాలను ఆదరించాలని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న రాయలసీమ సంగీత నృత్యోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా పలువురికి రాయలసీమ సంగీతరత్న, నాట్యరత్న అవార్డు అందించి సత్కరించారు.

# పల్లెటూరు.. పందేల జోరు

- ఊరూరా కోడిపందేలు
- సంక్రాంతి నేపథ్యంలో జోరందుకున్న జూదం
- తాగినోళ్లకు తాగినంత మద్యం..
- టీడీపీ నేతల కనుసన్నల్లో సాగుతున్న వ్యవహారం
- పండుగలు కావడంతో ఎవరు పట్టించుకోరన్న ధీమా..



వైఎస్సార్ జిల్లా అలవలపాడులో జోరుగా సాగుతున్న కోడి పందేలు

రాయచోటి : జిల్లాలో సంక్రాంతి పండుగ వేళ కోడిపందేలు జోరుగా జరుగుతున్నాయి. పదునెక్కిన కత్తులు కట్టిన కోళ్లను పోటీగా బరిలో దింపుతున్నారు. వీటికి పౌరుషాన్ని నూరిపోసి కథనరంగంలో కవ్విస్తున్నారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఎగిరి కాళ్లతో తన్నుకున్న కోడిపుంజులు రక్తపు మడుగులతో వీర మరణాలు చెందుతున్నాయి. ఈ పోరాటంతో వాటికి ప్రాణాలు పోతున్నా నిర్వాహకులకు, పందెం రాయుళ్లకు యమ కిక్కును తెప్పిస్తుంటాయి. ఇందుకోసం సంక్రాంతి పండుగ పేరుతో ఊరూరా పందేలు కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణ కోసం కూటమి బడా నేతల నుంచి గ్రామ నాయకుల వరకు పోటీ పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పందెం రాయుళ్లు కోడిపుంజులతో బరులకు దిగుతున్నారు.ఈ సందర్భంగా లక్షలాది రూపాయలను పందేలుగా కట్టి చేతులు మారుస్తున్నారు. పట్నం వైపు పరుగులు తీసిన వారంతా సంక్రాంతి సందర్భంగా పల్లెలకు రావడంతో మోడుబారిన పల్లెలు కాస్త కళకళలాడుతున్నాయి. ఫలితంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కోడిపందేల నిర్వహణ పోటాపోటీగా సాగుతోంది. సంక్రాంతి నేపథ్యంలో మూడు రోజుల పాటు కోడిపందేల నిర్వహణకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. జిల్లా పరిధిలోని రాయచోటి, రాజంపేట, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, కోడూరు నియోజకవర్గాల్లోని అధికార పార్టీ ప్రధాన నాయకుల కనుసన్నల్లో కోడిపందేలు పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు, పులివెందుల సబ్‌డివిజన్‌ల పరిధిల్లో మరీ విచ్చలవిడిగా జూదం, కోడిపందేలు సాగుతున్నాయి. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో లింగాల, చక్రాయపేట, వేంపల్లి, తొండూరు, సింహాద్రిపురం, వేముల, ఆర్‌కే వ్యాలీ మండలాల పరిధిల్లోని కొన్ని మారుమూల, కొండలు, గుట్టల ప్రాంతాల్లో, తోటల ప్రాంతాల్లో జూదం నడిపిస్తున్నారని తెలుస్తోంది.



అనేక ప్రాంతాల్లో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరిలో లాగా బారికేడ్లను ఏర్పాటు చేసి కోడిపందెం ఆట ఆడిస్తున్నారు. పందెం కట్టిన కోడికి రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న యువత పెద్ద ఎత్తున బరుల వద్దకు చేరుకుని పందేలు కాస్తున్నారు.

### పోలీసుల హెచ్చరికలు చేస్తున్నా..

కోడిపందెంలు, జూద శాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ, ఇతర పోలీసు అధికారుల హెచ్చరికలు అధికార పార్టీ నాయకులకు ఏ మాత్రం ఖాతరు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక నాయకులు, పందేల నిర్వహకులు కొంత మొత్తాలను వసూలు చేసి పోలీసులకు మామూళ్ల రూపంలో ముట్టచెబుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఒక వైపు పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూనే మరో వైపు పూర్తి స్వేచ్ఛ నివ్వడంతో ఈసారి పండుగ సరికొత్తగా ఉరకలెత్తుతోంది. కూటమి ప్రభుత్వం కల్పించిన స్వేచ్ఛ కారణంగా అనేకమంది పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు.

### రూ. వేలల్లో ఎంట్రీ ఫీజు

గ్రామాల్లో జరుగుతున్న కోడిపందెం, జూద శాలలు స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు సమాచారం. ఆటల నిర్వహణకు ఫీజు రూపంలో వసూళ్లు చేపడుతూ లక్షల రూపాయలను సంపాదిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆటల్లో పాల్గొనే ఒక్కొక్కరు వెయ్యి నుంచి రూ.5 వేల వరకు ఎంట్రీ ఫీజు రూపంలో చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇలా సేకరించిన మొత్తం నుంచి పోలీసులు, ఎక్సైజ్ పోలీసులతో పాటు స్థానికంగా ఉన్న బడా నేతలకు కొంత మొత్తాలలో వెళుతుందన్నది బహిరంగ రహస్యం.

### కాయ్ రాజా.. కాయ్..

కోడి పందేలతో పాటు ఎక్కడెక్కడ నుంచో వచ్చిన బంధువులు, మిత్రులు చిన్నాపెద్దా తేడా లేకుండా కాయ్‌రాజా కాయ్, పేకాట తదితర ఆటలు ప్రత్యక్షమయ్యాయి. ఇక మద్యం అయితే ఏరులై పారుతోంది. వచ్చిన బంధువులు, మిత్రుల కోసం స్థానికంగా ఉన్న వారు వారి స్థాయిని బట్టి మాంసాలను, పిండి వంటలను వండి వారికి రుచికరమైన ఆహారంగా అందిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మద్యం విక్రయం ద్వారా మూడు రోజుల్లోనే రూ.10 కోట్ల వ్యాపారాన్ని చేసుకున్న ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా రెండింతలు వ్యాపారాన్ని చేసుకునే ప్రయత్నాలకు తెగబడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న మద్యంతో పాటు స్థానికంగా ఉన్న కొంతమంది నాటు సారా బట్టీల ద్వారా తయారు చేసిన నాటు సారా కూడా అధికంగా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టాల్సిన ఎక్సైజ్ శాఖ మామూళ్ల మత్తులో మునిగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణాల నుంచి పల్లెలకు చేరుకున్న యువకులు పేకాట, కోడి పందెం, ఇతర వ్యవహారాల ద్వారా లక్షలాది రూపాయలను చేజార్చుకుని ఖాళీ చేతులతో తిరుగు ప్రయాణం కాయమని స్థానికంగా ఉన్న పలువురు పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు.



### క్రషర్ స్థలంలో కోడిపందెం నిర్వహణ..

**టిడిపి నేతల నుంచి ప్రాణహాని ఉందంటూ క్రషర్ యజమాని ఫిర్యాదు**



శ్రీనివాసులు, క్రషర్ నిర్వాహకుడు

రాయచోటి : రాయచోటి పట్టణ సమీపంలో ఉన్న క్రషర్ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించి దౌర్జన్యంగా కోడిపందెం ఆటను నిర్వస్తున్నట్లు క్రషర్ నిర్వాహకుడు శ్రీనివాసులు వాపోతున్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న దూళ్లవారిపల్లె సమీపంలో ఈ క్రషర్ ఉంది. రెండు రోజులుగా ఈ ప్రాంతాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహిస్తున్నారని, వద్దని చెబితే తనను చంపుతామని అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారన్నారు. సోమవారం పందెం జరుగుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా తెలియపరిస్తే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని సూచించారన్నారు. పోలీసులు మాత్రం స్పందించడం లేదని అంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని మీడియా ముందు శ్రీనివాసులు వాపోయారు. తాను అణగారిన వర్గానికి చెందిన వ్యక్తినని, తన క్రషర్ ప్రాంతం కూడా కోర్టులోఉందన్నారు. ఇక్కడ జిల్లా వ్యాప్తంగా కోడిపందెం సాగిస్తున్నట్లు స్థానికులు మదనపడుతున్నారు.

# డీఎస్పీ ఔట్..ఏఎస్పీ ఇన్!

**ఐపీఎస్ అధికారి మనోజ్‌రామనాథ్‌హెగ్డే నియామకం**



రాజంపేట : ఇప్పటి వరకు రాజంపేట సబ్‌డివిజన్‌కు ఎస్‌డీపీఓ(డీఎస్పీ) క్యాడర్ కొనసాగుతూ వచ్చింది. డీఎస్పీ హోదా పోయి, ఇప్పుడు తొలిసారిగా ఐపీఎస్ హోదా కలిగిన ఏఎస్పీ వచ్చారు. ఇప్పటి వరకు రాజంపేట డీఎస్పీలుగా 28 మంది పనిచేశారు.అయితే ఇప్పుడు ఐపీఎస్ అధికారి నియామకంతో రాజంపేట సబ్‌డివిజన్ రూపురేఖలు మారనున్నాయి.

**ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల నిలయం**

రాజంపేట ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్‌ఐ, ఐఎఫ్ఎస్ అధికారుల నిలయంగా మారింది. ఒకరంగా జిల్లా కేంద్రంలో ఉండే అత్యున్నతస్థాయి అధికారులు కీలమైన శాఖకు పనిచేయడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఇక్కడ ఐఏఎస్ హోదా కలిగిన సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి, రాజంపేట కేంద్రంగా జిల్లా అటవీశాఖ అధికారిగా ఐఎఫ్ఎస్ అధికారి జగన్నాథ్‌సింగ్ కొనసాగుతున్నారు. పోలీసుశాఖకు సంబంధించి ఐపీఎస్ అధికారిని ప్రభుత్వం నియమించడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఇక్కడ డీఎస్పీగా సుధాకర్ పనిచేస్తున్నారు. ఈయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

**ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్ హెగ్డే**

రాజంపేట ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డేను ప్రభుత్వం నూతనంగా నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. ఈయనను ఏఎస్పీగా రాజంపేట సబ్‌డివిజన్‌కు బదిలీ చేసింది. ఈయన 2022 బ్యాచ్‌కు చెందినవారుగా చెప్తున్నారు.

**ఎందుకు ఐపీఎస్‌ను వేయాల్సి వచ్చింది**

గ్రూప్–1 స్థాయి అధికారినే రాజంపేట ఎస్‌డీపీఓగా నియమిస్తూ వచ్చారు. లేకపోతే డిపార్టుమెంట్‌లో పదోన్నతిపై వచ్చిన వారే ఎస్‌డీపీఓగా నియమితులయ్యేవారు. ఇప్పుడు ఐపీఎస్ స్థాయి హోదా కలిగిన అధికారిని నియమించడంపై అనుమానాలు పోలీసువర్గాల్లో రేకెత్తిస్తున్నాయి.గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్, నేరాలు లాంటివి పెరిగిపోతున్నాయా అనే కోణంలో ఏఎస్పీని ప్రభుత్వం నియమించినట్లుగా పోలీసువర్గాలు భావిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికి రాజంపేట ఏఎస్పీని ప్రభుత్వం నియమించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## సంప్రదాయబద్ధంగా భోగి

రాయచోటి : భోగి పండుగను జిల్లావ్యాప్తంగా సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకున్నారు.సోమవారం తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు వీధుల్లో భోగి మంటలు వేశారు. మహిళలు అందమైన ముగ్గులు, గొబ్బెమ్మలతో ఇళ్ల ముంగిళ్లను తీర్చిదిద్దారు. కుటుంబ సభ్యులతో కలిసి భోగి వేడుకల్లో పాల్గొన్నారు. కొంతమంది పాటలు పాడుతూ, డ్యాన్స్‌లు చేస్తూ ఆనందంగా గడిపారు. ఇంకో వైపు ఉదయాన్నే భక్తులు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.డూ డూ బసవన్నల ఆటలు, హరిదాసుల పాటలు కనిపించకపోయినా,,, భోగి పండుగను తమకు ఉన్నంతలో కుటుంబ సభ్యులతో సంతోషంగా నిర్వహించుకున్నారు. బంధువులు, మిత్రులు ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.



గాలివీడు మండల పరిధిలో వేసిన భోగి మంటలు

# కనుల పండువగా గోదా కల్యాణం





కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వల్లూరు : వైఎస్సార్ జిల్లా పుష్పగిరిలో కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ మహా విష్ణువు అంశయైన శ్రీ చెన్న కేశవ స్వామికి, శ్రీ మహా లక్ష్మీ అంశయైన గోదాదేవికి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఆలయ మండపంలోని వేదికపై అలంకార భూషితులైన శ్రీ చెన్న కేశవ స్వామి, శ్రీ గోదాదేవిలు ఆశీనులవగా మంగళవాయిద్యాల నడుమ, వేద మంత్రాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా కొండ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది. కాగా తెల్లవారు జామున ధనుర్మాస ప్రాతఃకాల పూజను జరిపారు. ఉదయం స్వామివారికి బిందె తీర్థ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకట సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# ప్రైవేటు చేతికి హార్సిలీహిల్స్?

- ఆదాయం తగ్గిందని చూపి అప్పగించే వ్యూహం
- 9 నెలల్లో రూ.55 లక్షల నష్టం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.9.13 కోట్లతో ఆధునికీకరణ
- కొత్తగా రెస్టారెంట్ భవన నిర్మాణాలు
- ప్రైవేట్ కోసమే అంటున్న టూరిజం వర్గాలు



యాత్రీనివాస్ సముదాయంలోని స్నానాల గదిలో అసంపూర్తి పనులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం. రాష్ట్రంలో ఏకైక పర్వత నివాస ప్రాంతం కూడా ఇదే. తిరుపతి డివిజన్ పరిధిలోని హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్‌ను ప్రైవేటుకు అప్పగించే యత్నాలు మొదలయ్యాయని ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా ప్రైవేట్ ప్రతినిధులు హార్సిలీహిల్స్‌పైనున్న టూరిజం ఆస్తులపై పరిశీలన పూర్తి చేసినట్టు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ నేపథ్యంలో హార్సిలీహిల్స్‌ను ప్రైవేటు పరంపై ఆందోళన తీవ్రమైంది. ఈ విషయమై ఇటీవల సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా యూనియన్ నేతలు వినతిపత్రం అందించారు.

**రూ.9.13 కోట్లతో పనులు**

హార్సిలీహిల్స్ అభివృద్ధి, అతిథి గృహాల ఆధునికీకరణపై టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధికి రూ.9.13 కోట్ల నిధులు కేటాయించింది. అతిథిగృహాల ఆధునికీకరణ, కొత్త నిర్మాణాల కోసం పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 54 అతిథి గృహాలుండగా గవర్నర్ బంగ్లాను మినహాయించి మిగిలిన గదులకు రంగులు, కొత్తగా రెస్టారెంట్ భవనం నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. పర్యాటకశాఖ 2024 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌లోపు 9 నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుంది. వైల్డ్ విండ్స్ భవనంలోని 8, విండ్ విస్టిల్ భవనంలోని 6, విండ్‌ఫాల్ భవనంలోని 4 అతిథి గృహాలను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. దీంతో 18 అతిథిగృహాలను ఏప్రిల్ నెల నుంచి పర్యాటకులకు కేటాయించడం లేదు.

**9నెలల్లో రూ.55 లక్షల నష్టం**

ఏప్రిల్ నుంచి 18 అతిథి గృహాలను పనుల కోసం కాంట్రాక్టర్‌కు అప్పగించడం, వాటిని పర్యాటకులకు అద్దెకు ఇవ్వకపోవడంతో పర్యాటకశాఖకు గడచిన తొమ్మిది నెలల్లో రూ.55 లక్షల నష్టం వాటిల్లినట్టు ఉన్నతాధికారులకు సమాచారం. ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో ఈ లెక్కన నెలకు కనీసం రూ.6లక్షల నష్టం భరించాల్సిందే. డిసెంబర్‌లో పనులు పూర్తి చేసి పర్యాటకశాఖకు భవనాలను అప్పగించాలి. అయితే ఇంతవరకు ఒక్క గది పని కూడా పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నారు. పనుల కోసం గదుల్లోని వాష్‌రూమ్‌ల గోడలను పడగొట్టారు. కిటికీలు, ఫర్నిచర్ తొలగించగా వాటి పనులు ఇంకా పూర్తి చేయించలేదు. ఎలక్ట్రికల్ పనుల పరిస్థితి అలాగే ఉంది. ఏప్రిల్ నెల నుంచి పనులు చేపట్టగా తొమ్మిది నెలలు గడిచినా ప్రయోజనం లేదు.

**ఆదాయం లేదని చూపే యత్నం**

హార్సిలీహిల్స్ యూనిట్‌ను ప్రైవేటుకు అప్పగించాలన్న యత్నాల్లో భాగంగానే ప్రభుత్వంలోని ఓ అధికారి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. ఏటా రూ.3.50 నుంచి రూ.4.50 కోట్ల వరకు హార్సిలీహిల్స్ ఆదాయం ఉంటుంది. అలాంటిది గదుల పనులు పూర్తి చేయకుండా ఆదాయం తగ్గిపోయేలా చేస్తే దాన్ని ప్రైవేటుకు అప్పగించవచ్చన్న ఆలోచనతో ఇలా చేస్తున్నారని టూరిజం ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు. కాగా హార్సిలీహిల్స్‌పై టూరిజం కార్యకలాపాలను చెన్నైకి చెందిన ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు పరిశీలించి వెళ్లారని, దీనిపై ఓ అంచనాకు వచ్చారని చెబుతున్నారు. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

> **సీఎం దృష్టికి తెచ్చాం**
>
> టురిజంకు చెందిన యూనిట్లను ప్రైవేటుకు అప్పగించరాదని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అండగా నిలవాలని కోరాం. హార్సిలీహిల్స్ యూనిట్ నుంచి మంచి ఆదాయం వస్తోంది. దీన్ని ప్రైవేటీకరించవద్దని కోరాం. మిగిలిన టూరిజం సమస్యలపైనా సీఎంకు వినతిపత్రం అందించాం.
>
> – పీటీ.ప్రసాద్, జనరల్ సెక్రటరీ, టూరిజం ఉద్యోగం సంఘం

## క్లుప్తంగా

### ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**పుల్లంపేట :** పుల్లంపేట మండలం అనంతసముద్రం గ్రామ పరిధిలోని కందిరీగల గుట్ట వద్ద ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్న 12 మందిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను రాజంపేట డీఎస్పీ సుధాకర్ వెల్లడించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**బి.కొత్తకోట :** స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

స్థానికురాలైన దిల్షాద్ (56) కాలనీకి సమీపంలోని బీడు పొలాల్లో ఆదివారం రాత్రి మృతి చెంది ఉండగా గుర్తించారు. మృతురాలి శరీరంపై గీక్కుపోయిన గుర్తులు ఉన్నట్టు పోలీసులు గమనించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతురాలి కుమార్తె హసీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలించారు.

# ఆరు పదుల వయస్సులోనూ తగ్గేదేలే.!

- భోగి పండుగ.. ఆత్మీయ కలయికకు వేదిక
- హోదాలు.. వయోభేదాలు పక్కన పెట్టి..
- ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌తో సందడి చేసిన మాజీ క్రీడాకారులు



ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు

**రాజంపేట టౌన్ :** ఐదు పదుల వయస్సు దాటితేనే శరీరంలో సత్తువ తగ్గుతూ వస్తుంది. ఇక ఆరుపదుల వయస్సు దాటితే చిన్నపని చేసినా అలసట వస్తుంది. అయితే రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) మాజీ క్రీడాకారుల్లో భోగిపండుగ రోజు అలసట, శారీరక శ్రమ అన్నవి ఏమాత్రం కనిపించవు అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. అందుకు కారణం చిన్ననాటి క్రీడామిత్రులను కలుసుకోవడమే. సంక్రాంతి సందర్భంగా అపూర్వ సమ్మేళనాల పేరిట చిన్ననాటి మిత్రులు కలుసుకుంటుండటం ఇప్పుడు సర్వసాధారణమైంది. అయితే క్రికెట్ క్రీడ వల్ల పరిచయమైన చిన్ననాటి స్నేహితులు చిన్నప్పుడు వారు క్రికెట్ ఆడిన క్రీడామైదానంలోనే గత ఐదు సంవత్సరాలుగా భోగి పండుగ రోజున సరదాగా క్రికెట్ ఆడి అలనాటి తీపి గుర్తులను నెమరువేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మాజీ క్రీడాకారులు ప్రతి ఏటా భోగిపండుగ రోజు విధిగా కలుసుకుంటుండటం ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఈ ఏడాది కూడా భోగి పండుగను పురస్కరించుకొని సోమవారం మాజీ క్రికెట్ క్రీడాకారులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ మ్యాచ్ ఆడి చిన్ననాటి స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదించారు. ఈ మ్యాచ్‌లో ఒక జట్టుకు వడ్డే రమణ కెప్టెన్‌గా వ్యవహరించగా మరో జట్టుకు షేక్ అబ్దుల్లా కెప్టెన్‌గా వ్యవహరించారు. తొలుత బ్యాటింగ్ చేసిన అబ్దుల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వడ్డె రమణ జట్టు 9 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేయడంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తరలి రావడం విశేషం. వీరిలో దాదాపు అందరు ఐదు, ఆరు పదుల వయస్సు పైబడిన వారే కావడం మరింత విశేషంగా చెప్పుకోవాలి. నాలుగు దశాబ్దాల క్రితం రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) ఏర్పాటై రాయలసీమలోనే ప్రసిద్ధి గాంచిన క్రికెట్ జట్టుగా గుర్తింపు పొందింది. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏడాది భోగి పండుగ రోజున ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదికవుతోంది.

#### అదే ఆర్‌సీసీ గొప్పతనం



నాలుగు దశాబ్దాల క్రితం రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) ఆవిర్భవించి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. రెండున్నర దశాబ్దాల పాటు ఆర్‌సీసీ ప్రభ కొనసాగింది. ఎంతో మంది క్రీడాకారులు ప్రతిభను చాటి రాయలసీమకే గుర్తింపు తీసుకొచ్చారు. ప్రతి ఏడాది భోగి పండుగ సందర్భంగా మాజీ క్రీడాకారులందరు కలిసి మ్యాచ్ ఆడుతుండటం ఆర్‌సీసీ గొప్పతనం అని చెప్పాలి.

- పోలా శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఆర్‌సీసీ మాజీ ఆటగాడు, రాజంపేట

#### ఎంతో గర్వంగా ఉంది



ఆర్‌సీసీ ఆవిర్భావంలో నా భాగస్వామ్యం కూడా ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. దాదాపు 40 సంవత్సరాలైనా ఆర్‌సీసీ ద్వారా క్రికెట్ మ్యాచ్‌లు ఆడిన వారిలో ఏ మాత్రం ఉత్సాహం తగ్గలేదు. ఆరు పదుల వయస్సు పైబడినా పాత మిత్రులతో కలిసి క్రికెట్ ఆడేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు.

- షేక్ అబ్దుల్లా, ఆర్‌సీసీ మాజీ ఆటగాడు, రాజంపేట

#### థ్యాంక్ గాడ్



ఏడాదికి ఒకసారి ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు తాము క్రికెట్ సాధన చేసిన మైదానంలోనే కలుసుకుంటుండటం మాటల్లో చెప్పలేని ఆనందకరమైన విషయం. చిన్ననాటి క్రీడా మిత్రులు ఎక్కడ ఉన్నా వ్యయ ప్రయాసల కోర్చి విధిగా భోగి పండుగ రోజు క్రికెట్ మ్యాచ్ ఆడటం కోసం వస్తుండటం చాలా గొప్ప విషయం. ఈ విషయంలో మేము భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

- దయానంద్, లెక్చరర్, హిందూపురం

#### ఆర్‌సీసీ పేరు వింటేనే వైబ్రేషన్



ఆర్‌సీసీ ప్లేయర్స్‌లో కొంత మందికి ఆరుపదుల వయస్సు పైబడింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ప్రయాణం చేసి రాజంపేటకు రావాలంటే శారీరకంగా కాస్త అలసటగా కూడా ఉంటుంది. అయితే ఆర్‌సీసీ పేరు వినగానే ఆర్‌సీసీ ద్వారా క్రికెట్ ఆడిన ప్రతి ఒక్కరిలో వైబ్రేషన్స్ వస్తాయి. ఆ వైబ్రేషన్ వల్ల శారీరక శ్రమ దూదిపింజెలా ఎగిరిపోతుంది.

- దేవేంద్రనాథ్, రిటైర్డ్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్, తిరుపతి

### కొత్తిండ్లులో చోరీ

**రూ.4.5 లక్షల విలువైన నగదు, నగలు అపహరణ**

**మదనపల్లె :** మదనపల్లె మండలంలోని కొత్తిండ్లులోని ఓ ఇంటిలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి రూ.4.5 లక్షల విలువైన నగదు, నగలు చోరీ చేసుకుని వెళ్లారు. వివరాలు ఇలా.. కొత్తిండ్లులో నివాసమున్న అక్బర్ స్థానికంగా టైలర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. అతని బంధువులు ఇటీవల ఉమ్రాకు వెళుతుండగా వారిని సాగనంపేందుకు కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. కార్యక్రమం అనంతరం ఆదివారం రాత్రి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగిలి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లో పరిశీలించాడు. వస్తువులన్నీ చిందరవందరగా పడిఉండటం, బీరువా, కప్‌బోర్డులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. అనంతరం ఆదివారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.లక్ష నగదు, 60 గ్రాముల బంగారు నగలు, వంద గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. మొత్తంగా వీటి విలువ సుమారు రూ.4.5 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మేరకు తాలూకా పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం



వెంకటరమణ (ఫైల్)

**రామసముద్రం :** రామసముద్రం మండలం మాలలేనత్తం పంచాయతీ ఉప్పినెల్లి గ్రామానికి చెందిన సుబ్బన్న కుమారుడు ఎం.వెంకటరమణ(80) అదృశ్యమైనట్లు ఎస్.ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈనెల 6వ తేదీన వెంకటరమణ పెన్షన్‌తీసుకునేందుకు ఆటోలో రామసముద్రం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదని అతని కుమారుడు అంజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**మదనపల్లె :** ప్రైవేటు బస్సు ఢీకొని భార్యాభర్తలు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని చీకలిగుట్టకు చెందిన రమణ (55), అతని భార్య అంజమ్మ(45) సోమవారం చీకలబైలు పంచాయతీ తిప్పిరెడ్డిగారిపల్లెలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలోని చిప్పిలి సమీపంలో స్థానికంగా ఉన్న ఫుడ్‌ఫ్యాక్టరీకి చెందిన బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో రమణ, అంజమ్మ గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



## పోటా పోటీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



పోటీలలో ప్రథమ బహుమతిని దక్కించుకున్న ఎద్దు

**ప్రారంభించిన ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి**

**రాజంపేట రూరల్ :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బండలాగుడు పోటీలు నిర్వహించారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని ఎద్దు పోటీ పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వ మాజీ వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను వీక్షించేందుకు వచ్చిన వందలాది మందితో ఆకేపాటి ఎస్టేట్‌లో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. ప్రజలందరికీ ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. వైఎస్సార్ జిల్లా ఆలంఖాన్‌పల్లికి చెందిన రెడ్డిచెర్ల వెంకట్రామిరెడ్డి, రూకవారిపల్లికి చెందిన విద్య ఓబుల్‌రెడ్డిల ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, వైఎస్సార్ జిల్లా లసింగాయపల్లికి చెందిన మేడా వంశీరెడ్డి, తుడుమలదిన్నెకు చెందిన చందా హేమంత్‌రెడ్డిల ఎడ్లకు ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా బాలయ్యగారిపల్లికి చెందిన నంద్యాల విష్ణువర్దన్‌రెడ్డి ఎడ్లకు తృతీయ బహుమతిగా రూ.30 వేలు, వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లికి చెందిన వడ్డెమాను విశ్వనాథరెడ్డి ఎడ్లకు నాలుగవ బహుమతిగా రూ. 20వేలు, వైఎస్సార్ జిల్లాలోని ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన డి.భావనకు చెందిన ఎడ్లకు 5వ బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. పోటీలో పాల్గొన్న మిగతా ఎడ్లకు రూ.5వేలు చొప్పున ఎమ్మెల్యే ఆకేపాటి అందజేశారు. ఈ వేడుకల్లో టీటీడీ మాజీ బోర్డు మెంబర్ మాసీమ బాబు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నిజాయితీకి సత్కారం

**బంగారు ఆభరణాలు గల పర్సును అప్పగించిన యువకుడికి పోలీసుల ప్రశంసలు**



అశోక్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది

**సుండుపల్లె :** బంగారు ఆభరణాలు ఉన్న పర్సును పోగొట్టుకున్న మహిళకు ఆ పర్సును అప్పగించిన యువకుడిని పోలీసులు సన్మానించారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ, కురవపల్లికి చెందిన శ్రీలతకు సంబంధించిన 4 లక్షల 50 వేల రూపాయలు విలువజేసే బంగారు ఆభరణాలు ఉన్న పర్సును రాయచోటి పట్టణానికి చెందిన అశోక్ ఆదివారం అప్పగించాడు. శ్రీలత రాయచోటి నుంచి సుండుపల్లెకు ఆటోలో ప్రయాణిస్తుండగా రాచంవాండ్లపల్లి సమీపంలోని సబ్‌స్టేషన్ దగ్గర తన లగేజీ నుంచి పర్సు కింద పడిపోయింది. ఆమె సుండుపల్లికి వచ్చిన తరువాత పర్సు పోగొట్టుకున్న విషయాన్ని వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పర్సు పోగొట్టుకున్న ప్రదేశానికి వెళ్లి వెతకగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఒక గంట తరువాత రాయచోటికి చెందిన అశోక్ పర్సు దొరికిందని ఆ పర్సులోని ఫోన్ నంబరు ద్వారా శ్రీలతకు ఫోన్ చేసి సమాచారం తెలిపాడు. పోలీసుల సహకారంతో శ్రీలత అశోక్ దగ్గరికి వెళ్లగా అతను ఆమెకు బంగారు ఆభరణాలు ఉన్న పర్సును అందజేశాడు. విషయాన్ని సుండుపల్లి ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, రూరల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ సూచనల మేరకు సుండుపల్లి పోలీసులు అశోక్‌ను సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ బ్రహ్మం, హెడ్ కానిస్టేబుల్ బీడీ నాయక్, ప్రవీణ్ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### బాకీ విషయమై ఘర్షణ

**పెండ్లిమర్రి :** పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామంలో ఆదివారం రాత్రి బాకీ విషయమై జరిగిన ఘర్షణలో యార్లోపల్లె సుబ్బరాయుడు(50) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. సుబ్బరాయుడు కుమారుడు నాగసుబ్బయ్య అల్లు వంశీ అనే వ్యక్తికి అవసర నిమిత్తం డబ్బులు ఇచ్చాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వమని అడగ్గా అక్కడ మాటా మాటా పెరిగి ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో సుబ్బరాయుడుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా వంశీ, అతని తల్లి ఈశ్వరమ్మతో గొడవ పడుతుంటే సుబ్బరాయుడు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించాడన్నారు. ఆ క్రమంలో కాలికి మొద్దు తగిలి కింద పడి మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

### గాలిపటం ఎగరేస్తుండగా విద్యుత్ షాక్

**బాలుడికి తీవ్ర గాయాలు**

**కడప అర్బన్ :** కడప నగరంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ఓ బాలుడు (10) గాలిపటం ఎగరేస్తుండగా అకస్మాత్తుగా ఇంటిపైకి ఎక్కాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని బంధువులు రిమ్స్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు వెంటనే కర్నూలుకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

### సంక్రాంతికి అవ్వ ఇంటికి వెళ్తుండగా..

**- గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం**



మృతి చెందిన గణేష్

**బి.కొత్తకోట:** సంక్రాంతి పండగ కోసం అవ్వ ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు దుర్మరణం చెందాడు. బి.కొత్తకోట బీసీ కాలనీ చెందిన గణేష్ (25) అవివాహితుడు. సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి పెద్ద తిప్పసముద్రం మండలం బూచిపల్లె గ్రామంలోని అవ్వ ఇంటికి బైక్ మీద బయలుదేరాడు. గుడిపల్లి గ్రామం తానామిట్ట దాటుకొని వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో గణేష్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ జీవన్ గంగనాథ్ బాబు, సిబ్బంది ప్రమాద స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## రేషన్ బియ్యం లారీ కథ కంచికేనా.?

**ఐదురోజులైనా చర్యలు కరువు**



గుర్రంకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న రేషన్ బియ్యం లారీ

**గుర్రంకొండ :** గుర్రంకొండలో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ కథ కంచికేనా అంటూ గ్రామస్తులు చర్చించుకొంటున్నారు. విజిలెన్స్ పోలీసులు ఐదు రోజుల క్రితం 30 టన్నుల రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకుని గుర్రంకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు. అయితే ఐదు రోజులుగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కడప–బెంగళూరు జాతీయ రహదారి పక్కనే పోలీస్ స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మలా అందరికి దర్శనమిస్తోంది. జమ్మలమడుగు నుంచి రేషన్ బియ్యం బస్తాలు లోడు చేసుకొని ఓ లారీ బయలు దేరి కర్ణాటక వైపు వెళ్తుండగా జిల్లా విజిలెన్స్ పోలీసులు లారీని వెంబడించి గుర్రంకొండ వద్ద అదుపులోకి తీసుకొన్నారు. బియ్యం లారీని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉంచి వెళ్లిపోయారు. బియ్యం లారీకి రికార్డులు సరిగ్గా ఉన్నాయా లేదా అవి అసలు రేషన్ బియ్యమేనా, బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు అధికారుల అనుమతి ఉందా అన్న కోణంలో జిల్లా రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే విచారణ సాగతీత ధోరణిలో సాగుతుండడంతో ఐదు రోజులుగా బియ్యం లారీ పోలీస్ స్టేషన్ వద్దే ఉంది. రికార్డులు సరిగ్గా ఉంటే అవి రేషన్ బియ్యం కాకపోతే ఇన్ని రోజులు ఎందుకు పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు అన్న సందేహాలు జనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు బియ్యం లారీ కథ కంచికి వెళ్లకుండానే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ మధురామచంద్రుడును వివరణ కోరగా రేషన్ బియ్యం లారీ విషయం తమ పరిధిలో లేదని ఈ కేసు జిల్లా అధికారులు విచారిస్తున్నారని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు.

## మదనపల్లె మెడికల్ కాలేజీ ప్రైవేటు పరం చేయొద్దు



మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

**మదనపల్లె :** మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వం ప్రైవేటుపరం చేయొద్దని, ఆసుపత్రి సిబ్బంది బదిలీలు రద్దుచేసి వారిని కొనసాగించాలని, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మదనపల్లె మెడికల్ కాలేజీని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి గత వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్య చికిత్స అందించి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. రోజుకు 1,200 నుంచి 1,500 మంది అవుట్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు గ్రహణం పట్టిందని, స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజిని ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఆస్పత్రిలోని 44 మంది వైద్యులను ఇప్పటికే బదిలీ చేయగా, మరో 23 మంది స్టాఫ్‌నర్సులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించకపోతే, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకుడు ప్రభాకర్, న్యాయవాది సోమశేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి కూలీ మృతి

**పిల్లలతో కలిసి దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం**



బాలాజీ (ఫైల్)



బాలాజీ మృతదేహం

**మదనపల్లె :** పిల్లలతో కలిసి ఓ కూలి దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు పట్టణం బాలాజీ సినిమా థియేటర్ వద్ద నివాసం ఉన్న ఈశ్వర, రాజేశ్వరి దంపతుల కుమారుడు బాలాజీ(46) స్థానికంగా కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య బేబి, కుమార్తె మహేశ్వరి, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. బాలాజీ అయ్యప్ప మాలధారణ చేసి రెండు రోజుల క్రితం దీక్ష విరమించాడు. ఈ నేపథ్యంలో తన ఇద్దరు పిల్లలతో కలిసి బోయకొండ ఆలయానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. అక్కడ అమ్మవారికి తలనీలాలు సమర్పించి దైవదర్శనం ముగించుకుని తిరిగి పుంగనూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని కొలిమిపల్లి సమీపంలో ఎదురుగా బస్సు రావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి పిల్లలు ఒకవైపు, బాలాజీ మరోవైపు పడిపోయారు. ప్రమాదంలో పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే బాలాజీ తలకు గాయమై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

## బొప్పాయి పంటను ధ్వంసం చేసిన అడవి పందులు



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న బీట్ ఆఫీసర్ తదితరులు

**చిట్వేలి :** మైలపల్లి పంచాయతీ ఎం.రాచపల్లిలో రైతు ఈశ్వరరాజుకు చెందిన ఐదు ఎకరాలలో 5500 బొప్పాయి మొక్కలను ఆదివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో రైతుకు రూ. 80 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతుకు పొలం ఖాళీగా కనిపించేసరికి కన్నీటి పర్యంతమయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎఫ్‌బీఓ కరీం పంటను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి పంటనష్టం అందేలా చూస్తామని రైతుకు హామీ ఇచ్చారు.